# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక




పట్టభద్రుల ఎమ్మెల్సీ కొత్త ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల

3

సంపుటి : 01 | సంచిక : 292 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 01 అక్టోబర్ 2026 | పేజీ : 3



## మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- పాఠశాలల్లో 'నో డ్రగ్స్' బోర్డులు, టోల్ ఫ్రీ నంబర్ 1908 ప్రదర్శించాలి
- పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో పాన్, గుట్కా షాపులపై నిషేధం

2 లో



## జనవరి నాటికి గండి రామారం లిఫ్ట్ వన్ పూర్తి చేయాలి

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- రెండో పంటకు రైతులకు సాగు నీరు అందిస్తాం
- నెల రోజుల్లో పంప్ హౌస్ పనులు, నవంబర్ ఆఖరుకు పైప్‌లైన్ ముగియాలి
- పనుల క్షేత్రస్థాయి పరిశీలనలో ఎమ్మెల్యే ఆదేశం

**చిల్పూర్, మన చౌరాస్తా :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి గండి రామారం లిఫ్ట్ 1 ప్రాజెక్టు అత్యంత ప్రాముఖ్యమైనదని, ఎట్టిపరిస్థితుల్లోనూ వచ్చే ఏడాది జనవరిలో దీనిని ప్రారంభించి అభ్యర్థించిన రైతులకు రెండో పంటకు సాగు నీరు అందించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం చిల్పూర్ మండలం లింగంపల్లి శివారు లోని గండి రామారం ఎత్తిపోతల పథకం లిఫ్ట్ 1 పంప్ హౌస్ పనులను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు రైతులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎత్తైన ప్రాంతాలైన వేలేరు, చిల్పూర్ మండలాలకు సాగు నీరు ఇచ్చేందుకు ₹ 104 కోట్లతో గండి రామారం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గత పాలకులు కేవలం తమ సొంత భూములకు ఉపయోగపడే లిఫ్ట్ 2 పనులను మాత్రమే పూర్తి చేసుకుని, రెండు మండలాల ప్రజలకు మేలు చేసే లిఫ్ట్ 1, 3లను విస్మరించారని విమర్శించారు. తాము నిరంతరం వెంటపడి పనులు చేయించడంతో ఇప్పటివరకు 70 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. శాఖల మధ్య సమన్వయ లోపంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పంప్ హౌస్ సివిల్, మోటార్లు, ఎలక్ట్రికల్ పనులన్నీ నెల రోజుల్లో పూర్తి చేయాలని, నవంబర్ ఆఖరు నాటికి పైప్‌లైన్ పూర్తి చేసి డిసెంబర్‌లో ట్రయల్ రన్ నిర్వహించాలని స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ సీఈ ఆధ్వర్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2002లో తాము శంకుస్థాపన చేసిన దేవాదుల ప్రాజెక్టు నేడు నియోజకవర్గానికి జీవధారగా మారి వేలాది ఎకరాలకు నీరందిస్తుండటం సంతోషకరమన్నారు. దేవాదుల పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి రెండు పంటలకూ నీరందించడమే తన లక్ష్యమని, అభివృద్ధి పనులకు రైతులు, నాయకులు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సీఈ సుధీర్, ఎస్ఈ సీతారాం, ఈఈ ప్రవీణ్, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, కాంట్రాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.




# విద్యార్థినులు క్రమశిక్షణతో చదవాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**వేలేరు, మన చౌరాస్తా:** విద్యార్థినులు క్రమశిక్షణతో బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకుని సొంత గ్రామాలకు సేవలందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. బుధవారం వేలేరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులు, ఉపాధ్యాయులకు ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తాగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించి నిర్ణీత సమయానికి శుభ్రం చేయించాలని సూచించారు. భోజన పట్టిక ప్రకారం కూరగాయలు, నిత్యావసర సరుకులు అందుతున్నాయా అని ఆరా తీశారు. తరగతి గదుల్లోని విద్యుత్ పంకాలు పనిచేస్తున్నాయా అని పరిశీలించారు. అనంతరం వసతి గదులను పరిశీలించిన కలెక్టర్ ఒక్కో గదిలో ఎంతమంది విద్యార్థినులు ఉంటున్నారని అడిగి తెలుసుకున్నారు. దోమలు రాకుండా అన్ని వసతి గదులకు జల్లెడలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులు చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని, భవిష్యత్తులో తమ సొంత గ్రామాల అభివృద్ధికి సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరి రాజుగౌడ్, తహసీల్దార్ కోమి, జీసీడీవో సునీత, ఎంపీడీవో కిషన్, ఎంఈవో చంద్రమౌళి, కేజీబీవీ ప్రత్యేక అధికారి స్రవంతి, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 4న జనగామ జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

- జాతీయ స్థాయి నిడ్జామ్ (NIDJAM)-2026కు మార్గం
- అండర్-14, అండర్-16 విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు

**జనగామ, మన చౌరాస్తా :** 20వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ (NIDJAM) 2026లో భాగంగా జనగామ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను అక్టోబర్ 4న నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలిపారు. స్థానిక ధర్మకంచలోని మినీ స్టేడియంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికలు ప్రారంభమవుతాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేరుగా జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయికి వెళ్లేందుకు అవకాశం ఉన్న ఏకైక క్రీడా పోటీలు ఇవేనని ఆయన వెల్లడించారు. ఈ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నవంబర్ 14 నుంచి 16 వరకు సదాశివపేటలోని వోక్సేన్ యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి నిడ్జామ్ 2026 పోటీల్లో జనగామ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

**వయోపరిమితి వివరాలు..**

- అండర్ 14 విభాగం: 17.11.2012 నుంచి 16.11.2014 మధ్య జన్మించిన బాలబాలికలు అర్హులు. (ట్రయాథ్లాన్ A, B, C మరియు కిడ్స్ జావలిన్ త్రో పోటీలు ఉంటాయి. కిడ్స్ జావలిన్ త్రోలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొనాలి).
- అండర్ 16 విభాగం: 17112010 నుంచి 16112012 మధ్య జన్మించిన వారు అర్హులు. (60 మీటర్లు, 600 మీటర్ల పరుగు, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావలిన్ త్రో పోటీలు ఉంటాయి).

ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ వయస్సు ధృవీకరణ కోసం పుట్టిన తేదీ సర్టిఫికెట్ లేదా పదవ తరగతి మెమోతో నేరుగా వేదిక వద్దకు చేరుకోవాలని సూచించారు.

**మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు..**

- గంగిశెట్టి మనోజ్ కుమార్: 9885046437
- ఆవుల అశోక్: 9912453220
- వంచ చంద్రశేఖర్ రెడ్డి: 7799552233
- తూడి రంజిత్: 9985223047



సావిత్రి భాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలో సావిత్రి భాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల రోజులుగా ఉచితంగా శిక్షణ పొందుతున్న 30 మంది ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు గురువారం ₹2.25 లక్షల విలువగల స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. దాత, ఎన్ఎస్‌యుఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, రాచకొండ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాచకొండ ప్రశాంత్ సహకారంతో ఫౌండేషన్ చైర్మన్ యాసారపు కరుణాకర్ ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాచకొండ ప్రశాంత్ మాట్లాడుతూ.. పోటీ పరీక్షల్లో ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు రూ.50 వేల నగదు బహుమతి ఇస్తానని, అలాగే ప్రిలిమ్స్, ఫిజికల్ ఈవెంట్స్ అర్హత సాధించిన వారికి గజ్వేల్‌లో ఉచిత శిక్షణ, వసతి కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యులు చిలువేరు అభి గౌడ్, కౌన్సిలర్ భాస్కర్, నర్సింగ రావు, శ్రీనివాస్, రాజశేఖర్, రమేష్, రామకృష్ణ, నవీన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతా చర్యలు చేపట్టాలి

- ఘనపూర్, చిన్న పెండ్యాల, కరుణాపురం ఎఫ్ఓబీ పనుల్లో స్పీడ్ పెంచాలి
- గోల్డెన్ అవర్‌లోనే బాధితులకు అత్యవసర వైద్యం అందాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో రహదారి భద్రతను పటిష్టం చేయడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌తో కలిసి జిల్లా రహదారి భద్రతా కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి 163, ప్రధాన రహదారుల్లో సూచికలు, లైటింగ్, సర్వీస్ రోడ్లు, వేగ నియంత్రణ తదితర అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఘనపూర్ (స్టేషన్), చిన్న పెండ్యాల, కరుణాపురం ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి (FOB) నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కోమల్ల టోల్ ప్లాజా, కరుణాపురం మద్యం దుకాణాల వద్ద మరియు రైల్వే స్టేషన్ పరిసరాల్లోని అనధికార పార్కింగ్‌లను వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. వేగ నియంత్రణకు అవసరమైన చోట రంబుల్ స్ట్రిప్స్, థర్మోప్లాస్టిక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని, జనగామ పట్టణ ప్రవేశ మార్గంలో ఉన్న బెల్ మార్క్‌ను సరిచేయాలని సూచించారు. అలాగే విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాల బస్సుల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరును ఆర్టీఏ అధికారులు తనిఖీ చేయాలన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు 'గోల్డెన్ అవర్'లోనే వైద్యం అందేలా ఆసుపత్రుల మ్యాపింగ్, గ్రీన్ ఛానల్, రూట్ మ్యాపింగ్‌తో సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పెంబర్తి వైజంక్షన్ వద్ద సైన్ బోర్డులు, నవాబుపేట వద్ద రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసినట్లు డీసీపీ వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, కిరణ్ ప్రకాష్, ఘనపూర్ ఏసీపీ భీం శర్మ, ఆర్టీఏ సభ్యులు చిలువేరు అభి గౌడ్, ఎన్‌హెచ్ఏఐ అధికారి మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, విద్యా, వైద్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అయోధ్యకు నెల్లుట్ల ఫౌండేషన్ బృందం

**జనగామ, మన చౌరాస్తా :** సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సంస్థ అయిన 'నెల్లుట్ల ఫౌండేషన్' అధ్యయన బృందం జనగామ నుండి వరంగల్ మీదుగా ఉత్తరప్రదేశ్ (అయోధ్య) పర్యటనకు బుధవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా 'కవులు కళాకారుల ఐక్యవేదిక, జనగామ' ప్రతినిధులు ఈ బృందానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఫౌండేషన్ అధ్యయన బృంద నాయకులు నెల్లుట్ల రవీందర్ రావు నేతృత్వంలో సాగుతున్న ఈ సాంస్కృతిక యాత్రలో గౌరవ స్టీరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ వేముల సదానందం, రాసాల బాలరాజు, వంగ వెంకటేశ్వర్లు, ఎస్.ఆర్. శ్రీనివాస్, డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంతశర్మ తదితరులు ఉన్నారు. ఈ అధ్యయన యాత్రలో భాగంగా బృంద సభ్యులు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య, వారణాసి, లక్నో వంటి పలు చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించనున్నారు. అక్కడి సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు, ప్రజల జీవన విధానం, వ్యవసాయం, నీటి వనరులు, విద్యా వైజ్ఞానిక రంగాలలో జరుగుతున్న ప్రగతిపై వారు సమగ్ర అధ్యయనం చేయనున్నారు. ఈ సాంస్కృతిక అధ్యయన బృందం యాత్ర అత్యంత దిగ్విజయంగా, జయప్రదంగా సాగాలని జనగామ కవులు కళాకారుల ఐక్యవేదిక ప్రతినిధులు జి.కృష్ణ, పెట్లోజు సోమేశ్వరా చారి, అయిలా సోమనర్సింహాచారి, చిలుమోజు సాయికిరణ్ తదితరులు ఆకాంక్షించారు.

# మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

- పాఠశాలల్లో 'నో డ్రగ్స్' బోర్డులు, టోల్ ఫ్రీ నంబర్ 1908 ప్రదర్శించాలి
- పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో పాన్, గుట్కా షాపులపై నిషేధం

జనగామ, మన చౌరాస్తా : జిల్లాలో మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టి, జనగామను మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌తో కలిసి మాదకద్రవ్యాల నియంత్రణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో పాన్, పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రతి పాఠశాలలో 'నో డ్రగ్స్' సైన్ బోర్డులతో పాటు, సమాచారం అందించేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1908ను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. డ్రగ్స్ బారిన పడిన వారికి పునరావాసం కల్పించేందుకు జిల్లాలో డీఅడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. డీసీపీ రాజ మహేంద్ర నాయక్ మాట్లాడుతూ.. డ్రగ్స్ నివారణపై పోలీస్ శాఖ నిరంతర నిఘా ఉంచుతుందని, ప్రజలు కూడా భాగస్వాములై సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, కిరణ్ ప్రకాష్, ఏసీపీ భీం శర్మ, డీఎంహెచ్ఓ వాణిశ్రీ, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



# 2న నల్ల నరసింహులు శత జయంతి ఉత్సవాలు



**పాలకుర్తి, మన చౌరాస్తా :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు నల్ల నరసింహులు శత జయంతి ఉత్సవాలకు తరలి రావాలని పాలకుర్తి మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు మాచర్ల సారయ్య కోరారు.బుధవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల నల్ల నరసింహులు విగ్రహం పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి పెనుగొండ రమేష్,పోప జిల్లా కార్యదర్శి చిదురాల ఎల్లయ్య,స్థానిక గ్రామ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోగు శ్రీనివాస్, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గజ్జెల్లి వెంకన్నతో పాటు పద్మశాలి సంఘం నాయకులతో కలిసి మాచర్ల సారయ్య నల్ల నరసింహులు శత జయంతి ఉత్సవాల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీడత ప్రజల కోసం తెలంగాణ విముక్తి కోసం నాటి నిజాం, రజాకార్ల దురాగతాలు,భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా నల్ల నరసింహులు ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటం సాగించారని అన్నారు. అక్టోబర్ 2న జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంట సమీపంలో నల్ల నరసింహులు శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలోపాలకుర్తి గ్రామ మాజీ ఉపసర్పంచ్ కాటబత్తి రమేష్,మాజీ ఎంపీటీసీలు దేవసాని కృపాకర్, చిదురాల ధనంజయ,కుల వృత్తుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎదునూరి మదర్, వార్డ్ సభ్యులు కామారపు సునీల్, పాలకుర్తి పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి చిదురాల మార్కండేయ, ముదిరాజ్ సంఘం నాయకులు మామిండ్ల సోమయ్య,పాలకుర్తి సొసైటీ డైరెక్టర్ ఎడవెల్లి సో మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నారగోని ఎల్లయ్య గౌడ్, రచయిత మాన్యం భుజంగర్,మండల పద్మశాలి సంఘం నాయకులు శ్రీరాం సుధాకర్,వెంకన్న, వైట్ల రామ్మూర్తి,పోగు చిరంజీవి, రాపోలు రాంబాబు, గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ పరిస్థితులపై విద్యార్థుల అధ్యయనం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** శ్రీ రాజేశ్వర విశ్వవిద్యాలయం వ్యవసాయ పాఠశాలకు చెందిన తుది సంవత్సరం వ్యవసాయ విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా బుధవారం గట్లనర్సింగాపూర్ గ్రామంలో పాల్గొనే గ్రామీణ మదింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సామాజిక, వ్యవసాయ, ఆర్థిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులు, ప్రజల జీవన విధానం, వ్యవసాయ కార్యకలాపాలు, గ్రామ సమస్యలను విద్యార్థులు అధ్యయనం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామంలోని సమస్యలను గుర్తించడం, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడం, వ్యవసాయాభివృద్ధికి అవసరమైన చర్యలను గుర్తించడం వంటి అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ పాఠశాల డీన్ డాక్టర్ జి. భూపాల్ రాజ్, డాక్టర్ బి. శ్రీను, డాక్టర్ జి. భార్గవి, సర్పంచ్ బి. అజయ్ కుమార్, ఉపసర్పంచ్ శ్రీను, వార్డు సభ్యులు, వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్. సంతోష్, గ్రామ రైతులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, రైతులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఎమ్మెల్యేను కలిసిన మైనారిటీ నాయకులు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి వాణి, జనగామ : జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి , టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి తో మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు మజీద్ అప్సర్ మర్యాద పూర్వకంగా కలిసి,మైనార్టీ పాలకుర్తి నియోజకవర్గం లోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండల మైనారిటీ అధ్యక్షుల నియామకాలపై చర్చించారు. ఈ సమావేశంలో, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్,జడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యులు ఎం డి మదార్, జిల్లా అధికార ప్రతినిధి నరేంద్ర పవర్,జనగామ పట్టణ కార్యదర్శి ఖాదర్ షరీఫ్, మైనారిటీ మండల మాజీ అధ్యక్షులు ఎం డి.సలీం మొహసిన్ యూత్ కాంగ్రెస్ జనగాం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి,మాజీ ఎంపీటీసీ ఎం డి రహీం తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి

**కొడకండ్ల, మన చౌరాస్తా :** కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్-రోజా దంపతుల ఏకైక కుమార్తె ధరావత్ రుహన్షి నాయక్ పుట్టిన రోజు సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి రుహన్షికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.రుహన్షీ శ్రద్ధగా చదువుకుని విద్యలో రాణించి, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాలకుర్తి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోగు శ్రీనివాస్, డిసిసి కార్యదర్శి మదార్, పాల్గొన్నారు.





# ఘనంగా మాజీ ఎమ్మెల్యే సతీష్ జన్మదిన వేడుకలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు వొడితల సతీష్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని భీమదేవరపల్లి మండల భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారం ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు మండల సురేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సతీష్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జక్కుల అనిత రమేష్, సంగ సంపత్, సల్వాల తిరుపతి, ధర్నా శ్రీనివాస్, శనిగరపు సదానందం, గుడికందుల రాజు, గద్ద కుమారస్వామి, సిక ప్రదీప్, రాగం రమేష్, కందే సుధాకర్, తాళ్ల జయంత్, బొల్లంపల్లి సుకుమార్, రచ్చ సంపత్, మాడుగుల సుభాష్, పోలు మహేందర్, మద్దె రాజు, కొత్తగట్టు రజినీకాంత్, మేకల మహేందర్, గద్వాల ప్రశాంత్, రేణిగుంట్ల శ్రీనాథ్, శిఖ పవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా

**జంగా రాఘవరెడ్డి**



**వరంగల్, మన చౌరాస్తా :** ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఉమ్మడి వరంగల్ జిల్లా రీజియన్ గౌరవ అధ్యక్షులు, వర్కర్స్ తెలంగాణ యూనియన్ అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి తెలిపారు. వరంగల్ జిల్లాలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు, సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించిన ముఖ్యమైన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు TWC-SWF కూటమి బాణం గుర్తుకు ఓటు వేసి ఘన విజయం చేకూర్చాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రీజియన్ గౌరవ అధ్యక్షులు, వర్కర్స్ తెలంగాణ యూనియన్ అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రామ్మోహన్, అశ్వత్థామ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం,హక్కుల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై కీలకంగా మాట్లాడారు. కార్యక్రమంలో twu జిల్లా సెక్రటరీ జితేందర్ రెడ్డి, ఎస్‌డబ్ల్యూఎఫ్ సెక్రటరీ ఉపేందర్ చారి,పి ఎల్లయ్య పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ కొత్త ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల

**జనగామ, మన చౌరాస్తా :** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ కొత్త ఓటర్ల జాబితా తయారీకి సంబంధించి షెడ్యూల్ విడుదలైనట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితా నమోదుకు 2026 నవంబర్ 1వ తేదీని అర్హత తేదీగా నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు.

01.11.2026 నాటికి కనీసం మూడేళ్ల క్రితం (2023 నవంబర్ 1 కంటే ముందు) డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఫారం18 (Form18) ద్వారా ఏఈఆర్వో (AERO) లకు లేదా నియమిత అధికారులకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ఓటర్ల జాబితా షెడ్యూల్ వివరాలు:

- నవంబర్ 6 వరకు: ఫారం18 దరఖాస్తుల స్వీకరణ
- నవంబర్ 25: ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితా ప్రచురణ
- నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 వరకు: క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ
- డిసెంబర్ 25 లోగా: అభ్యంతరాల పరిష్కారం, సప్లిమెంట్ల తయారీ
- డిసెంబర్ 30 : తుది (ఫైనల్) ఓటర్ల జాబితా ప్రచురణ

అర్హత కలిగిన పట్టభద్రులందరూ నిర్ణీత గడువు లోగా దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.